ఆమె వచ్చి అప్పుడే అరగంట పైన అయింది. ఇంతవరకు ఆరు రకాల జోళ్లు 'ట్రై' చేసి తనకి నచ్చలేదంది. ఏడవసారి మృదువుగా ఆమె పాదాన్ని చేతి లోకి తీసుకుని, ఇంకోరకం జోడు తొడుగుతున్నాడు రహీమ్. ప్రొద్దుట వచ్చినది మొదలు తిరిగి ఇంటికి వెళ్లేదాకా ఇలా ఎన్ని పాదాలు పట్టుకోవలసి వస్తుంది? ఈ లెక్క ఎప్పుడో కట్టేశాడు రహీమ్. తన వాటాకి సగటున రోజుకి ముప్ఫై మొదలు నలభై జతల పాదాలు. ఈ జోళ్ల షాపులో రహీమ్ 'సేల్స్‌మన్'గా ప్రవేశించి నాలుగేళ్లు అయింది. ఈ నాలుగేళ్లలోనూ (మధ్య ఆదివారాలు మినహాయించి) రోజుకి ఇన్ని జతల పాదాల చొప్పున తను ఎన్ని పాదాలు పట్టుకొని ఉంటాడు? తను పెద్ద అయిన తరవాత 'ఇంతకంటే ఘనకార్యం చేయబోవులే' అని తను చదువుకున్న ఉపాధ్యాయు లంతా ఏకగ్రీవంగా హామీ ఇచ్చారు. 'ఒరేయ్, రహీమ్! కొంత మంది ఎంత పచ్చగా ఉన్నా వాళ్లకి గోరింటాకు అంటదురా. అలాగే నీకు చదువుమాత్రం అంటదురా' అని తెలుగు మాస్టారు ప్రత్యేకంగా భరోసా ఇచ్చారు. 'నువ్వు చూపుల గుర్రానివిరా! నాలుగు జతల గాడిదల్ని చూసుకో' అని తన భవిష్యత్తుకి పునాది వేశారు లెక్కల మాస్టారు.

ఆలోచనలు అడ్డుతగులుతున్నా, అలవాటు ప్రకారం ఒకటి తరవాత ఒకటి పట్టుకొచ్చిన జోళ్ళు తొడుగుతున్నాడు. "ఇది సరిగ్గా ఉంది, మేడమ్" అన్నాడు. "కొంచెం చిన్న సైజు కాదా" అంది మేడమ్. ఇంకో పెట్టెలోంచి మరో జోడు తీసి తొడిగాడు. జోడు సైజు చిన్నదవడం వల్ల, మేడమ్ కాలిమడమ కొంచెం బయటికి ఉండిపోయింది. బయటికి మిగిలిపోయిన ఆ మడమను రెండు వేళ్లతోటే అల్లా నొక్కేస్తే? మళ్లా మంచినీళ్లు అడగదు. అరగంట నుంచి చంపేస్తోంది. ముఖం మీద చిరునవ్వు మాత్రం జారనీయకుండా గడ్డకట్టించి. మరో జోడు చూపించాడు. కస్టమర్స్‌తో అతి కర్టియస్‌గా ఉండటం తన ఉద్యోగానికి మొదటి క్వాలిఫికేషన్. మేడమ్‌కి ఆ జోడు నచ్చినట్టుంది. జోడు తొడిగి, ఎదుట నిలువుటద్దంలో చూస్తూ, నాలుగడుగులు అటూ ఇటూ వేసింది కార్పెట్ మీద. "ఇది కరెక్ట్‌గా ఉంది, మేడమ్" అన్నాడు రహీమ్. "ఇల్లాంటిదే హై హీల్సు కావాలి" అంది మేడమ్. "సారీ, మేడమ్! నాలుగైదు రోజుల్లో వస్తాయి కొత్త మోడల్సు" అన్నాడు రహీమ్ వినయంగా. మేడమ్ చిరాగ్గా వెళ్లిపోయింది. 'ఈ చచ్చు మడమలకి హై హీల్సు ఒకటా!' అనుకున్నాడు రహీమ్, జోళ్లని తిరిగి పెట్టెలో పెడుతూ. 'అరికాలిలో వంపు కూడా లేదు. ఫుట్‌బాల్ ఆడేప్పుడు ఇల్లాంటి చచ్చుపాదాలు కనుపించాయంటే బంతిని వదిలి, వాటినే తన్నే వాడు. తన మడమ తాపు తిన్నవాళ్లు మళ్లా వారం రోజుల దాకా లేస్తే ఒట్టు.

తను ఫుట్‌బాల్ ఆడే రోజులు జ్ఞాపకం వచ్చాయి. ఆ రోజుల్లో ఓ వెలుగు వెలిగాడు. సర్కిల్ గారి అబ్బాయి అని ఊళ్లోనూ, బళ్లోనూ ఓ ప్రత్యేకత ఇవ్వబడుతూండేది. స్కూల్ ఫుట్‌బాల్ టీమ్‌కి అతను కెప్టెన్. తను స్కూల్ ఫైనల్ దాకా వచ్చి అక్కడ మేట వెయ్యటం వల్ల స్కూల్ విడిచి వెళ్లే అవసరం రాలేదు. దానివల్ల ప్రతి ఏటా ఫుట్‌బాల్ షీల్డు వాళ్ల స్కూలుకే గుత్త అయిపోయింది. ఆకర్షణీయమైన విగ్రహం రహీమ్‌ది. కసరత్తో మెలి దిరిగిన కండరాలు, ఆరడుగుల అతని శరీరపు పొడవులో నాజూగ్గా ఇమిడి పోయాయి. పచ్చని శరీరచ్ఛాయలో, విశాలమైన నుదుటి వెనక నిగనిగ లాడుతూ మెరిసే ఉంగరాల జుట్టూ, తీర్చిదిద్దిన పొడుగాటి ముక్కుకు రెండు వైపులా అమాయకత్వాన్ని సూచించే నీలి చారల కళ్లూ — ఇవి చాలా మంది అమ్మాయిలని కలవరపరిచాయి ఆ రోజుల్లో. తన అందంవైపు అతని ఆలోచనలు ఎప్పుడూ పోయేవి కావు. తనతో చదువుకున్న అమ్మాయిలు, తన కంటె పై క్లాసు చదివే అమ్మాయిలు కూడా అతను ఎక్కడ ఉంటే అక్కడ తచ్చాడుతూ ఉండేవారు. ఏదో వంక పెట్టి పలకరించి మాట్లాడుతుండేవారు. ఒకసారి ఓ అమ్మాయి అతన్ని పలకరించి ఏం మాట్లాడాలో తెలియక "మీ తెలుగు నోట్సు ఓ సారి ఇస్తారా?" అంది. తను పగలబడి నవ్వాడు. "అడక్క అడక్క నన్నే అడిగావా, తల్లీ! నా తెలుగు పాండిత్యం గురించి ఉప్పుడు పిండి గార్ని అడగండి ( అంటే తెలుగు మాస్టారు )" ఆయనుంటే మంగలాడు ఎందుకన్నట్టు.





మంద మళ్ళింపు

ఫొటో — ఆర్. ఉదయభాస్కర్ (తిరుపతి)

ఆ నోట్సు రాసే అలవాటే నాకుంటే, ఈ క్లాసులోనే రెండేళ్ళు ఎందుకుంటాను, తల్లీ!" అంటూ తిరిగి నవ్వడం ఆరంభించాడు. ఆ అమ్మాయి చిత్తరపోయి వెళ్ళిపోయింది. ఆ ఊళ్ళో ప్రిన్సిపాలుగారి అమ్మాయి, సబ్—జడ్జి గారి అమ్మాయి, పెద్ద డాక్టరు గారి అమ్మాయి, ఇంకా ఎంతో మంది అతనికి ఉత్తరాలు రాసేవారు. కాని, ఏ ఒక్క ఉత్తరానికీ జవాబు వ్రాయడానికి అతనికి ధైర్యం చాలేది కాదు. కారణం తండ్రి.తండ్రి పేరు చెపితే చాలు, అతనికాళ్ళలో వణుకు అంత వరకు పైజామా లోంచి బయటికి కనిపించేది. ఒకసారి సబ్ జడ్జిగారి అమ్మాయి నిర్మల తన ఉంగరాల జుట్టు మీద నాలుగు పేజీల ఉత్తరం వ్రాసింది.

అప్పుడు జరిగిన సంఘటన ఒకటి జ్ఞాపకం వచ్చింది రహీమ్‌కి. కొండపల్లి పిక్‌నిక్‌కి వెళ్ళారు తన క్లాస్ వాళ్ళంతా. కొండ దిగడం మొదలు పెట్టేసరికి చీకటి పడింది. నిర్మల మిగతా ఆడపిల్లల లోంచి విడిపోయి, తన చొక్కా పట్టుకుని వెనక్కి లాగి ఆపుచేసింది. తామిద్దరూ కొండ దిగి బస్సు దగ్గరికి వచ్చేసరికి రాత్రి తొమ్మిది గంటలయింది. ఆ రెండు గంటల్లోనూ ఎన్నో విషయాలు మాట్లాడింది నిర్మల. బొంబాయి పారిపోదా మంది. తన దగ్గర డబ్బు ఉందంది. తనకు అమ్మమ్మ ఇచ్చిన స్వంత ఆస్తి ఉందంది. తామిద్దరూ ఉన్న భవిష్యత్తుని గురించి ఎన్నెన్నో చెప్పింది. కొండ దిగి బస్సు దగ్గరికి వచ్చేసరికి కూడా వచ్చిన టీచరు కారాలు మిరియాలు నూరుతూ ఎగిరి పడ్డాడు. మిగతా వాళ్ళంతా తమకేసి గుర్రుగా చూశారు. నిర్మల మరీ నిర్లక్ష్యంగా తనని జరగమని పక్కనే కూర్చుంది. తర్వాత పరిస్థితులు మారిపోయాయి. తన తండ్రి చనిపోవడం, ఉన్న కాస్త ఆస్తీ సవతి తల్లి చేజిక్కించుకోవడం, తన చదువుకి స్వస్తి చెప్పడం, మేనమామ ఏదో సంబంధం చూసి పెళ్ళి చేసెయ్యడం, పొట్ట చేత్తో పట్టుకుని ఈ ఊరు రావడం — ఇలా ఒక్కొక్క సంఘటనా తన్ని అందలం నుంచి ఊబిలోకి దింపింది. చివరికి ఈ ఊళ్ళో జోళ్ళ షాపులో తన ఆశలన్నీ ఆవిరయాయి. నిర్మలకి ఉన్న ధైర్యంలో తనకి వందో వంతు ఉండి ఉంటేనా? జీవితం మరోలా నడిచి ఉండేది. రహీమ్‌కి దిగులు పుట్టుకొచ్చింది. ఎదురుగా పెద్ద కాలెండర్‌లో 29 వ తేదీ తనకేసే చూస్తోంది.. ఆ వేళ తను పుట్టిన రోజు. ఇరవై ఎనిమిదేళ్ళు నిండి ఇరవై తొమ్మిదవ ఏడు వచ్చింది.. ఈ పుట్టిన రోజు నాడు భవిష్యత్ మీదికి ఆలోచనలు పోవటం లేదు.. జరిగిపోయిన రోజుల మీదికే మళ్ళుతున్నాయి ఆలోచనలు. బీబీ పుట్టింటికి వెళ్ళింది పురుటికి. చంటివాడికి అయిదవ నెల వచ్చింది, తీసుకు వెళ్ళమని ఉత్తరాలు వ్రాస్తున్నారు. తన మీదికి ఇంకో భారం వచ్చి పడింది. తనకు వచ్చే వంద రూపాయలనే సాగదీయాలి అన్నింటికీ. అప్పుడు నిర్మల చెప్పినట్లు చేసి ఉంటేనా? అనుకున్నాడు మరోసారి. ఇప్పుడు నిర్మల ఎక్కడ ఉందో? ఏ పెద్ద ఆఫీసర్‌నో పెళ్ళి చేసుకుని ఉంటుంది. పుట్టిన రోజు పేరు చెప్పుకుని పక్క హోటల్‌లో ఓ కప్పు చాయ్ తాగి వద్దామని లేచాడు. ఇంతలో షాపు ముందర ఓ కారు ఆగింది. అందులోంచి ఓ యువతి దిగి లోపలికి వచ్చి తన ఎదురుగా ఉన్న కుర్చీలో కూలబడింది. చేతిలో ఉన్న ప్లాస్టిక్ సంచి లోంచి ఓ చీర సగం పైకి లాగి, దానితో మాచ్ అయే శాండల్సు తెమ్మంది. రహీమ్ లోపలికి వెళ్ళాడు. ఆమె చేతిలో ఉన్న హేండ్‌బాగ్ పక్క కుర్చీలో పెట్టింది. కళ్ళకు ఉన్న గాగుల్సు ఓసారి తీసి తుడిచి తిరిగి పెట్టుకుంది. ఆమె కళ్ళలో ఏదో నిర్లిప్తత ఒక్క క్షణం బయటికి తొంగి చూసింది. ఎదురుగా ఉన్న నిలువుటద్దం వేపు కూడా ఆమె కళ్ళు తిప్పలేదు. ప్రొద్దుట తొమ్మిది గంటలకు షాపింగ్‌కి బయలుదేరింది. ఇప్పటిదాకా తిరుగుతూనే ఉంది.

## పాలగుమ్మి విశ్వనాథం

ప్రొద్దుట టిఫిన్ తిని బయలుదేరింది. తర్వాత ఓ సారి ఐస్‌క్రీమ్, రెండుసార్లు కాఫీ అయాయి. మెల్లిగా ఏ రెండు గంటలకో ఇల్లు చేరుకుంటుంది. వంటావిడ బల్లమీద అమర్చి పెట్టిన భోజనంలో చాలా భాగం అల్లాగే మిగిలిపోతుంటుంది. తర్వాత నడుం వాల్చి ఏదైనా పుస్తకం చదువుదామని ప్రయత్నిస్తుంది. ఆ ప్రయత్నం కొనసాగకపోతే నిద్రపోదామని ప్రయత్నిస్తుంది. ఈ రెండు ప్రయత్నాలు విఫలమైతే, బుర్రని ఆలోచనలకి వదిలేసి, మగతగా మంచం మీద అటూ ఇటూ దొర్లుతుంది. ఇంతలో అయిదు గంటలు అవుతుంది. వంట మనిషి కాఫీ తెచ్చి పక్కన పెడుతుంది. కాఫీ తాగి బట్టలు వేసుకోవడంతో ఓ గంట మెల్లిగా జరుగుతుంది. తర్వాత కారు తీసుకుని ఏదైనా సినిమాకిగాని, స్నేహితుల ఇళ్ళకు గాని, లేకపోతే ప్రశాంతంగా ఉన్న రోడ్ల వేపు కాని కారు మళ్ళించి ఏ తొమ్మిది గంటలదాకానో కాలక్షేపం చేసి, ఇల్లు చేరుకుంటుంది. భర్త కాంపుకి పోయినప్పుడల్లా ఆమె దిన చర్య ఇది. భర్త పెద్ద ఇంజనీరు. నెలకి ఇరవై రోజులు కాంపులోనే ఉంటాడు. ఊళ్ళో ఉన్నప్పుడు కూడా ఎప్పుడూ ఆఫీసు పనిలోనే మునిగిపోయేవాడు. కొత్త ప్రాజెక్టులు, కొత్త వంతెనలు, కొత్త భవనాలు, వాటి తాలూకు ప్లానులు, కాన్ఫరెన్సులు — ఇదీ భర్త

ప్రపంచం. కొంతకాలం తనూ భర్త కార్యక్రమాల్లో ఉత్సాహంపంచుకోవడానికి ప్రయత్నించింది. క్యాంపులకి భర్తతో వెళ్లేది. కాని, అతని ప్రపంచం వేరు. అప్పుడప్పుడు తను పక్కను ఉన్నదనే స్పృహకూడా ఉండేది కాదు. తన దాంపత్య జీవితంలో మొదటి రెండేళ్ళ మినహాయించి కాలం పెద్ద బండరాయిలా కదలడం మానేసింది. పాప బ్రతికే ఉంటే ...

నాలుగైదు రకాల జోళ్ల పెట్టెలతో వస్తున్న రహీమ్ ఆమె ఆలోచనలకి అంతరాయం కలిగించాడు. ఆమె కూర్చున్న కుర్చీ దిగువ ఉన్న చిన్న స్టూల్ మీద కూర్చుని పరధ్యానంగా ఓ పెట్టె తెరిచి జోడు తీసి తొడిగి, "ఇది సరిగ్గా ఉంది, మేడమ్" అన్నాడు వంచిన తల ఎత్తకుండానే. మేడమ్ జోడు కేసి చూడటం లేదు. కళ్లకున్న గాగుల్సు తీసివేసి వంగి ఉన్న అతని తలమీది ఉంగరాల జుట్టు కేసి పరీక్షగా చూస్తూంది. అల్లాంటి ఉంగరాలజుట్టు మీదే తను నాలుగు పేజీల ఉత్తరం వ్రాసింది కాలేజీలో చదువుకునేరోజుల్లో. "మేడమ్, ఈ జోడు. . ." అంటూ తల పైకి ఎత్తాడు. మిగతా మాటలు అతని నోట్లోంచి పైకి రాలేదు "రహీమ్!" అంది ఆశ్చర్యపోతూ. షాక్ కొట్టినట్లు తన చేతిని తొడిగిన జోడుమీద నుంచి వెనక్కు లాక్కున్నాడు. "నిర్మలా? !" అన్నాడు నమ్మకం కుదరనట్టు. పైన మెత్తలు వేసిన కుర్చీలో ఆమె, ఆమె కాళ్ల దగ్గర చిన్న స్టూల్‌మీద అతను — ఒకరి నొకరు చూసుకుంటూ అల్లాగే ఉండిపోయారు కొన్ని క్షణాలు. ఎన్నో ప్రశ్నలు ఒకేసారి వచ్చాయి ఇద్దరి మనస్సుల్లోకి. కస్టమర్సు ఎవరో అటు కేసే వస్తున్నారు. "సాయంకాలం ఏడు గంటలకి టాంక్‌బండ్ మీద టీ స్టాల్‌కి ఎదురుగా నేను ఉంటాను" అని చెప్పి తొందరగా లేచి వెళ్లిపోయింది నిర్మల.

ఆ సాయంకాలం ఏడు గంటల తరవాత హుసేన్‌సాగర్ ఒడ్డున, మసక చీకట్లో కారులో ఓ మూలగా కూర్చుని, జీవితంలో దగా పడిపోయాం అనుకున్న ఆ ఇద్దరూ గడిచిన జీవితాలని నెమరు వేసుకుంటున్నారు. ఒకప్పుడు అనుకున్నట్టుగా జరిగి ఉంటే? ఇప్పుడు మాత్రం మించిపోయిందేమిటి? తన దగ్గర డబ్బుంది, మిగిలిన జీవితం హాయిగా ఎక్కడో గడిపేయవచ్చు. తన భర్తకి తను ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. తను సుఖాల్ని ఎవర్ని ఉద్ధరించడానికి త్యాగం చేయాలి? రహీమ్ ఆ జోళ్లషాపులోనే అఖరు కావలసిందేనా? నిర్మల, రహీమ్‌ల మనస్సులలో రేగిన ఊహలు కలిసిపోయి ఒకే దిక్కుగా ప్రయాణం చెయ్యడం మొదలెట్టాయి. దాని పర్యవసానం ఆ మరునాటి సాయంకాలం తొమ్మిది గంటలకు మద్రాస్ పోయే రైలులో, ఫస్టు క్లాస్ కంపార్ట్‌మెంటులో నిర్మలా, రహీమ్‌లు కూర్చుని ఉన్నారు. పాత జీవితాన్ని వెనక్కి నెట్టేస్తూ రైలు వేగంగా పోతూంది. కంపార్ట్‌మెంటులో తమ ఏకాంతాన్ని భంగం చేస్తూ ఇంకో వ్యక్తి ఉన్నందుకు నిర్మల చిరాకు పడింది. కాని, ఆ వ్యక్తి తెలుగువాడు కాదు, అదో సుగుణం. కులాసాగా మాట్లాడుకోవచ్చు. రహీమ్‌కి తను తొడుగుకున్న టెరిలిన్ సూట్ మొదలు ఇప్పుడు ప్రయాణం చేస్తున్న ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ దాకా అన్నీ కొత్తే. తన జీవితంలో అల్లాంటి సూట్ ఎప్పుడూ తొడగలేదు. ఇప్పుడు తన కాలికి ఉన్న నైలాన్ సాక్సు ఖరీదుతో ఇందాకటి దాకా తను తొడుగుకున్న పైజామా, లాల్చీలు రెండు జతలు కొనవచ్చు. జోళ్లషాపులోనే పని చేస్తున్నా తన కాళ్లని ఎప్పుడూ శిథిలావస్థలో ఉన్న చెప్పులే అంటి పెట్టుకుని ఉండేవి. ఇప్పుడు నలభై రూపాయలు ఖరీదు చేసే బూట్సు తన సూట్ క్రింద మెరిసిపోతున్నాయి. కూర్చుంటే సూట్ ఎక్కడ నలిగిపోతుందో అన్నట్టూ, గట్టిగా నడిస్తే జోడు కందిపోతుందేమో అన్నట్టూ మెల్లిగా అడుగులు వేసుకుంటూ కంపార్ట్‌మెంట్‌లో అటూ, ఇటూ పచారు చేస్తున్నాడు రహీమ్. నిర్మల అన్నీ కళ్లతో అనుసరిస్తూంది. రాత్రి తొమ్మిది గంటలు అయింది. బట్టలు మార్చుకోమంది నిర్మల. తోలుపెట్టె తెరిచి, అడుగున ఉన్న రాత్రి దుస్తులు తియ్యడంలో ఓ పేపరు పొట్లం క్రింద పడింది. అది తను కొన్ని గంటల క్రితం దాకా తొడుగుకున్న




ఆమె రాచరిక సౌందర్య రహస్యం

ఐటెక్స్

సౌందర్య సాధనములు

ముప్పై సంవత్సరములకు పైగా ప్రసిద్ధి

చెందిన సౌందర్య పరికరాలు




Aravind Laboratories

MADRAS-33

AL-3

# 'ఫణి'



## నాటక సమీక్ష

ఈమధ్య తెలుగు నాటకరంగంలో ఉత్సాహవంతమయిన మార్పులూ, ప్రక్రియలూ కనిపిస్తున్నాయి — చదువూ సంస్కారం ఉన్న యువతరం కళాభిరుచితో రంగంలో ప్రవేశించడంతో కొత్త దారులు కనిపిస్తున్నాయి కొత్త గాలులు వీస్తున్నాయి.

ఈ మధ్య శ్రీ ప్రఖ్య శ్రీరామమూర్తి రచించిన 'ఫణి' నాటకం స్టేజి చేసిన తీరు చూస్తుంటే మన రంగం ముందడుగు వేస్తూందనిపిస్తుంది. ఒకే ఒక సెట్టులో మొత్తం కథ చరచర సాగిపోతుంది— ఎక్కడా విసుగు అనిపించదు. కారణం—నటుల వాకచక్యం, దర్శకుని అనుభవం.

మద్రాసు 'కళావాహిని' వారిఆధ్వర్యంలో మైలాపూర్ ఫైన్ ఆర్ట్సు క్లబ్‌లో నటరాజ కళాసమితి (శ్రీకాకుళం) వారు ఈ ప్రదర్శనను ఇచ్చారు.

ఇందులో ఫణిగా నటించిన శ్రీ రమణమూర్తి నటన, హావభావ ప్రదర్శనం, తోటి నటీనటులను తన నటనా చాతుర్యంతో కథతో తీసుకుని వెళ్ళే దర్శకత్వ శక్తి అపూర్వం.

సి. ఐ. డి. గా శ్రీ సోమయాజులు, శంకరంగా శ్రీ రామమూర్తి, గజపతిగా శ్రీ కుమార్‌లు అతి లేకుండా సరదాగా నటించారు. సి. ఐ. డి. రూపం హుందాగా ఉంది కాని, భావప్రదర్శనలో పట్టు తగ్గిందేమో? గజపతి కళ్ళతో ఒప్పించాడు.

ఫణిని కాస్త వెనక్కు వెళ్ళి నటించమని చెప్పడానికి కాబోసు పెరటివైపు ఎర్ర తెరలోంచి చేయి ఊపడం పాత్రకు, కథకు సంబంధం లేదని తేలాక బాధే అనిపించింది. ప్రార్థన పూర్తయి తెర ఎత్తబోతున్నారనగా ప్రేక్షకుల పక్క నుంచి బుజాన ఫ్లాస్కుతో ఒక వ్యక్తి లోనికి ప్రవేశించడం— అదీ పాత్ర కాకపోవడం—ఏం బాగు?

పద్మగా నటించిన కుమారి పి. విజయలక్ష్మి నటనలో వయసు తెచ్చిన నవ్వులే కాని, హావ భావ ప్రదర్శన లేదు. తన భర్తే తనను హత్య చేయించడానికి కుట్ర పన్నాడని విన్నప్పుడు ఈమెలో గాలివానలు చెలరేగాలి; భయం, బాధ భగ్గుమనాలి. అవేమీ లేవు. సామాన్యంగానే ఉండిపోతుంది. అయితే, కథకు తగినట్లు నటించిన తీరు, నటనలో శ్రద్ధ బాగున్నాయి.

మొత్తం నాటకం అంతా చూశాక మంచి నాటకం చూశామన్న సంతృప్తి కలిగింది. ఆ ఘనత రచయితకూ, రమణమూర్తికీ దక్కుతుంది. ఆఖరి సన్నివేశంలో మరింత శ్రద్ధ తీసుకుని ఉంటే ఇంకా బాగుండేది. రంగాలంకరణ, లైటింగ్, ఆహార్యం చాలా బాగున్నాయి.

కళాపోషణకు పేరు పొందిన శ్రీ పి. వి. రమణయ్య (రాజా) తన వివాహ వజ్రోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని కళావాహిని' భవననిధికి 516 రూపాయల నిధిని సమర్పించినట్లు ఈ సందర్భంలో ప్రకటించారు.

—ఎల్లోరా

---

వారల పైజామా, గళ్ళలాల్చీ. తను సరాసరి షాపునుంచి రైల్వేస్టేషన్‌కే వచ్చేశాడు. అతనికి కావలసిన బట్టలన్నీ కొని వెయిటింగ్‌రూమ్‌లో నిర్మల వేచి ఉంది. కొత్త బట్టలు వేసుకున్నాక విప్పిన బట్టలు ఏం చెయ్యాలో తోచక న్యూస్‌పేపరులో చుట్టి పెట్టెలో ఓ మూలకి తోసేశాడు. అప్పుడు ఆ పొట్లం కాస్త బయట పడింది, పాత జీవితాన్ని జ్ఞాపకం చేస్తూ. ఆ వెధవ పొట్లం బయటికి విసిరేస్తే? పాత జీవితంతో ఉన్న ఆ కాస్త బంధం తెగి తెరిపిని పడవచ్చు. కాని, కంపార్ట్‌మెంట్‌లోని ఇంకో ఆసామీ తనకేసే చూస్తున్నాడు. తిరిగి ఆ పొట్లాన్ని పెట్టెలో పడేసి పెట్టె మూసివేశాడు. రాత్రికి వేసుకున్న సిల్కు పైజామా, ఓపెన్‌షర్టు శరీరాన్ని మృదువుగా నిమురుతున్నాయి. మూడో వ్యక్తి పక్క పరుచుకుని, "లైట్ తీసెయ్యవచ్చా?" అని ఇంగ్లీషులో అడిగాడు. "అభ్యంతరం లే"దంది నిర్మల. లైట్ తీసేసి నీలి దీపం వేసి, ఆ వ్యక్తి పైబెర్తు ఎక్కి పడుం వాల్చాడు. కంపార్ట్‌మెంట్‌కి చల్లని నీలి కాంతి అలుముకొంది. ఆ నీలి కాంతిలో నిర్మలా, తనూ ఏవో లోకాల్లో తేలిపోతున్నట్టనిపించింది. నిర్మల దగ్గరగా జరిగింది. తెల్లవారేసరికి ఔరంగాబాద్. అక్కడ అజంతా, ఎల్లోరాలు చూసి అక్కడినుంచి బొంబాయి. బొంబాయిలో కొంతస్థిమిత పడ్డాక తీరుబడిగా ఇళ్లకు ఉత్తరాలు వ్రాయవచ్చు. తన భర్త క్యాంపునించి తిరిగి వచ్చేసరికి ఇంకో వారం రోజులు పడుతుంది. ఈ లోపుగా భర్తకు వ్రాయవచ్చు. భర్తతో విడాకులు అయాక తనూ, రహీమ్ ఎక్కడో వివాహం చేసుకోవచ్చు. రహీమ్‌కి ఈ విడాకుల బాధ లేదు. తాము ఎక్కడ ఉన్నా బీబీకి నెలకి ఓ వంద రూపాయలు పడేస్తే సరి, సమస్యలు అవే సర్దుకుంటాయి. ఈ ఆలోచనలతో రాత్రి గడిపేసింది నిర్మల.

రహీమ్ ఆలోచించే స్థితిలో లేడు. ఒక కొత్త లోకంలో ఉన్నాడు అతను. తను పడుకున్న బెర్తు, దానిమీద బూరుగుదూది పరుపు, ముఖమల్ తలగడ—అవన్నీ అంత మరీ మెత్తగా ఉంటే నిద్ర ఎల్లా పడుతుంది? ఆ ఫస్టు క్లాస్ కంపార్టుమెంట్ మరీ ఖాళీగా ఉన్నట్టనిపించింది. తన జబ్బ బలంతో థర్డు క్లాస్ కంపార్టుమెంట్ తలుపు దగ్గర మనుష్య శరీరాలతో కట్టిన కోట గోడను భేదించి, లోపల ప్రవేశించి, కష్టార్జితమైన చోటులో కూర్చుని, రైలు కుదుపుతో కునుకు పట్టి, పక్కవాడి భుజం మీదికి తల వాల్చి నిద్రపోవడం అలవాటైన రహీమ్‌కి ఆ రాత్రి సరిగా నిద్ర పట్టలేదు.

తెల్లవారుతూండగా రైలు ఔరంగాబాద్ చేరింది. స్టేషన్‌కి దగ్గరగా ఉన్న హోటల్‌లో రూమ్ తీసుకుని, స్నానాలు, ఫలహారాలు ముగించుకుని, కారియర్‌లో భోజనం పెట్టించుకుని, టాక్సీలో అజంతాకి బయలుదేరారు. ఔరంగాబాద్‌కి సుమారు ఏభై మైళ్ల దూరంలో అజంతా గుహలు ఉన్నాయి. టాక్సీ తొమ్మిది గంటలకి అక్కడికి చేరింది. చిరు చలి రహీమ్‌లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తూంది. నిర్మల అతని 'హిప్' పోకెట్‌లో పెట్టిన బొద్దుగా ఉన్న పర్సు అతని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేస్తూంది. ఎంక్వైరీ ఆఫీసుకు వెళ్ళి,

అజంతాకి సంబంధించిన చరిత్ర, ఫొటోలు గల ఆల్బమ్ కొని, 'గైడ్'ని తీసుకుని గుహలు చూడడానికి బయలు దేరారు. ముందు నడుస్తున్న గైడ్ అజంతా చరిత్ర చెపుతున్నాడు.

"మొదట ఈ గుహలను కనుగొన్న చేస్తున్న సైనికులు 1819 వ సంవత్సరంలో కనుక్కొన్నారు. అర్ధ చంద్రాకారంగా వ్యాపించి, సుమారు 250 అడుగుల ఎత్తు గల ఈ కొండలో 29 గుహలు నిర్మించబడ్డాయి. ఈ గుహల నిర్మాణం క్రీస్తు శకము మొదటి శతాబ్దియందు ఆరంభమై ఏడవ శతాబ్దము వరకు సాగింది. తొమ్మిది వందల ఏండ్లు జరిగిన ఈ కళాసృష్టి మానవుడు అందుకున్న ఔన్నత్యాన్ని చాటుతూంటుంది. . ." గంభీరమైన అతని గొంతు శతాబ్దాల వెనక నుంచి వస్తున్నట్టుంది. రహీమ్ మనస్సు శతాబ్దాల వెనక్కి పరుగెడుతూంది. గుహల నిర్మాణానికి ఎన్నుకొన్న ఆ చోటు, అర్ధచంద్రాకారంగా ఉన్న ఆ కొండ, దానిని అంటి పెట్టుకుని పారే ఆ కొండ వాగు, 250 అడుగుల ఎత్తున్న ఆ కొండని తొలచుకుని నిరూపించు కున్న ఆ నాటి మానవుని ఆధిక్యం, 900 ఏళ్ల కళాసృష్టి ఈ నాటి మానవుని చిన్నతనాన్ని జ్ఞప్తికి తెస్తున్నాయా అని పించింది రహీమ్‌కి. కళలు, సాహిత్యం— ఏటివేపు అతని మనస్సు ఎప్పుడూ పోలేదు. కాని, ఈ వేళ రహీమ్‌లో ఎన్నో ఆలోచనలు చెలరేగాయి. బోధిసత్వ పద్మపాణి కన్నులు తననే వెదుకుతూ తను ఎటు వెడితే అటు తననే వెంటాడు తున్నట్టు అనిపించింది. పద్మపాణి కరుణార్ద్ర నయనాలు ప్రశాంతతని వెదజల్లుతున్నాయి. చంచల హృదయా లకు నిశ్చలతని చేకూరుస్తున్నాయి. ఒక్కొక్క కుడ్యచిత్రం దగ్గర అతని కాళ్లు కట్టుబడి పోతున్నాయి. కళ్లు అప్పగించి నిలబడిపోతున్నాడు. తనతో పాటు చూడటానికి వచ్చిన వాళ్లు త్వరత్వరగా ముందుకు నడిచి పోతున్నారు. రహీమ్‌లో ఆ తొందర ఏమీ కనిపించ టం లేదు. నిర్మల మాత్రం కొంచెం తొందర పడుతూంది. పదవ గుహ దగ్గరికి వచ్చేసరికే పన్నెండు గంట లయింది. "భోజనానికి విరామం" అంది నిర్మల. ఆ వాగు పక్క నీడలో కారియర్ విప్పి నిర్మల వడ్డించింది. కూడా ఉన్న గైడ్ తన మూట విప్పుకుని రొట్టెలు తినడానికి కూర్చున్నాడు. రహీమ్ భోజనం చేస్తూనే ఎడతెరిపి లేకుండా ప్రశ్నలు వేస్తున్నాడు. పదవ గుహ లోని బౌద్ధ



శివతాండవం ( ఎల్లోరా )
ఫొటో—సి. వి. చంద్రశేఖర్ ( గుడియాత్తం )

గాథ, షడ్దంత జాతకము, బోధివృక్ష పూజ—ఇవన్నీ వివరంగా చెపుతున్నాడు గైడ్. నిర్మలకి ఇదంతా విసుగ్గా ఉంది. ఇక్కడకు వచ్చినది మొదలు తనతో ఒక్క మాటకూడా మాట్లాడలేదు. ఫొటోఆల్బమ్‌లో ఒక ఫొటో చూపిస్తూ, అది ఏమిటని అడిగాడు రహీమ్. "అది బుద్ధుని జీవితంలో ముఖ్యమైన ఘట్టం. ఈ జీవితం దుఃఖమయం, నిరాశాజనకం. సిద్ధార్థునికి ఎదురైన ప్రశ్నలు ఎన్నో. మానవుడు ఈ దుఃఖ మయ జీవితంనుంచి విముక్తి పొందే మార్గం అన్వేషించడానికి తన ఇరవై తొమ్మిదవ ఏట భార్యను, ఒక్క కుమారుణ్ణి, రాజ్యసౌపాదాన్ని, సర్వ సుఖాల్ని పరిత్యజించి వెళ్లిపోయే దృశ్యం. దీన్నే మహాభినిష్క్రమణం అంటారు." "మహాభినిష్క్రమణం" అంటూ రెండు మూడు సార్లు కూడబలుక్కున్నాడు రహీమ్. భోజనాలు ముగించి తిరిగి బయలుదేరారు. పదహారవ గుహలో ఆసన్న మరణుడయిన రాజపుత్రిక చిత్రం దగ్గర నిలబడి పోయాడు రహీమ్. అతని కళ్లు చెమ్మగిల్లాయి. జాతక కథాచిత్రాలు అతని మనస్సును హత్తుకున్నాయి. సిద్ధార్థుని జననం, అసితఋషి బాలునిచే జాతక పరిశీలన, విద్యార్థిదశ, ధ్యాన గత గీతముల రాజ్యసౌగమనము, మానవుడు ఎదుర్కొంటున్న వ్యాధి దారిద్ర్య జరా మరణ సన్నివేశ దృశ్యాలు, బుద్ధ భగవానునికి సుజాత, త్రిపుస్స ఒసగిన భిక్షల చిత్రాలు అతని మనస్సులో నిలిచి పోయాయి. పదహారవ గుహలోంచి బయటకు వచ్చే సరికి నాలుగు గంటలయింది. ఇంకొక్క గంట మాత్రం టైమ్ ఉందని చెప్పాడు గైడ్. మిగతా గుహలు త్వర త్వరగా చూచి ఇరవై తొమ్మిదవ గుహ దగ్గరకు వచ్చారు. ఆ గుహలో ఎడమ పక్క గోడపై ఉన్న శిల్పం రహీమ్‌ని నిగ్రాంతుణ్ణి చేసింది. అది మహా పరినిర్వాణదృశ్యం. భౌతిక దేహం చాలించిన బుద్ధభగవానుడు పవ్వళించి నప్పుడు అతని తల కింద ఉన్న దిండు ముడతల్నికూడా ఎంతో సహజంగా మలిచాడు శిల్పి. కఠినమైన శిలలో, తలదిండు మృదుత్వాన్ని స్ఫురింప జేసే ఆ శిల్పి చాతుర్యం అతణ్ణి ముగ్ధుణ్ణి జేసింది. ఎటు చూసినా నిర్వికల్పబుద్ధ మూర్తులు ప్రశాంతతనీ, నిశ్చలతనీ వెద జల్లుతున్నాయి. రహీమ్‌లోకూడా ఆ నిశ్చలత ఇంకుతూంది. రెండు రోజుల నుంచి వశం తప్పి విహరిస్తున్న అతని ఆలోచనా విహంగాలు గూడు చేరుకుని ప్రశాంతంగా రెక్కలు చేరదీసుకుంటు న్నాయి. ఒక్కటే ఒక్క ఆలోచన ధవళవిహంగంలా, శాంతి కపోతంలా తనలో, తన చుట్టూ తిరుగుతూంది. తన ఇరవై తొమ్మిదవ ఏట సిద్ధార్థుడు సర్వ సౌఖ్యాల్ని త్యజించి, భార్యనీ, కుమారుణ్ణీ విడిచి బయటకు వచ్చేశాడు. తనూ అదే పని చేశాడు. తన ఇరవై తొమ్మిదవ ఏట భార్యనీ, అయిదు మాసాల పసివాణ్ణీ విడిచి పెట్టి వచ్చేశాడు. దుఃఖమయమైన ఈ ప్రపంచం నుండి మానవాళిని రక్షించడానికి మార్గాన్ని అన్వేషించడం కోసం సిద్ధార్థుడు, మహాభి నిష్క్రమణం చేస్తే, తనో? స్వార్థ పరుడై, తన సౌఖ్యం కోసం సమస్యలని ఎదుర్కోలేక పిరికివాడిలా పారిపోయి వచ్చాడు. భగవానునిది మహాభినిష్క్రమణ మైతే, తనదో? వార్త్రీతో పలాయనం. తన మీద తనకే ఏవగింపు కలిగింది. కాని, భగవానుని ప్రాంగణంలో ఏ ప్రాణికి బాధపడడానికి, దుఃఖపడడానికి హక్కు ఉంది? అజంతాలోని స్త్రీమూర్తుల లోంచి అమాయకురాలైన అమీనా బీబీ తొంగిచూస్తున్నట్టనిపించింది. భగవానుడు అనేకమైన జీవితాల్లోకి చల్లదనం తీసుకువచ్చాడు. ఎందరి దుఃఖాలనో చెరిపేశాడు. తను ఆఖరికి తన భార్యకి— ఒక్క వ్యక్తికైనా సౌఖ్యం, ఆనందం ఇవ్వగలిగితే అంతే చాలు అనుకున్నాడు.

అజంతా నించి ఔరంగాబాద్ తిరిగి పోతున్నప్పుడు, నిర్మల అతని మీద చేయి వేసినప్పుడు అజంతాలోని శిలా ప్రతిమని ముట్టుకున్నట్టే అనిపించింది. హోటల్ గదిలో తెల్లవారి నిర్మల లేచే సరికి రహీమ్ లేడు. క్రితం రోజు తొడుగుకున్న టెరిలీన్ సూట్ మడత పెట్టి సూట్‌కేస్‌లో పైన ఉంది. పాంట్ హిప్ పాకెట్‌లో బొద్దుగా ఉన్న పర్సు అల్లాగే ఉంది. కిందటి వారం సాయం కాలం అతను తొడుక్కు వచ్చిన చారల పైజామా, గళ్లలాల్చీ ఉన్న కాగితం పొట్లం సూట్‌కేస్‌లో కనిపించలేదు నిర్మలకి. ★